ప్రజాశక్తి
సోమవారం 19 జూన్ 2023

పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ ప్రర్యాటక కేంద్రమైన బొర్రా గుహలకు సందర్శకులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో విదేశీ, ఇతర ప్రాంతాలకు చెందిన వేలాది మంది పర్యాటకుల తాకిడి నెలకొంది. బొర్రా గుహలు తిలకించిన అనంతరం కటికి. తాడిగుడ జలపాతాలు సందర్శించి స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. అనంతగిరి కాఫీ ప్లాంటేషన్ మీదుగా అరకు సుంకరమెట్ట యు పాయింట్ తిలకించారు. మండుతున్న ఎండలు, వడగాల్పుల కారణంగా పర్యాటకు లేక వెలవెల బోయిన ఈ ప్రాంతాలు ఆదివారం కిటకిటలాడాయి.

బొర్రా గుహల వద్ద పర్యాటకులు

మండుతున్న కూరగాయల ధరలు

-బెంబేలెత్తుతున్న పేద, సామాన్య ప్రజలు-పచ్చిమిర్చి కిలో రూ.60..అల్లం రూ.250 పైనే...

ప్రజాశక్తి-పాడేరుటౌన్: మండుతున్న ఎండలతో పాటు మార్కెట్‌లో కూరగాయల ధరలు కూడా మండి పోతున్నాయి. కొన్ని రోజుల నుంచి కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికే పెరిగిన నిత్యావసర ధరలతో పాటు విద్యుత్ చార్జీల మోతతో సతమవుతున్న సామాన్యులపై కూరగాయల ధరల పెరుగుదల మరింత భారంగా మారింది. ఏ కూరగాయలు కొనాలన్నా ధరలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఎండల తీవ్రతకు దిగుబడులు దారుణంగా పడిపోవడంతో ఈ రేట్లు అమాంతం పెరిగి పోయాయి. రోజురోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. ఏ కూరగాయలు కొనాలన్నా ధరలతో బెంబేలెత్తుతున్నారు. పాడేరు మార్కెట్‌లో కిలో టమోట రూ.45, వంకాయలు కిలో రూ.40, బెండకాయలు రూ.50, పచ్చిమిర్చి కిలో రూ.60, అరటికాయ రూ.8కి అమ్ముతున్నారు. బంగాళదుంప కిలో రూ.30, దొండకాయలు రూ.40, . అల్లం కిలో రూ.250, బీరకాయలు కిలో రూ.60, క్యాప్సికం కిలో రూ.90, అనపకాయ రూ.20, ఉల్లిపాయలు కిలో రూ.25 అమ్ముతున్నారు. ఎండలు మండిపోతుండడంతో ఆ ప్రభావం పంటలపై పడి దిగుబడి తగ్గడంతో కూరగాయల ధరలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. మార్కెట్‌లోకి వెళ్లాలంటే పేద, మధ్య తరగతి ప్రజలు ధైర్యం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఐదు, ఆరు నెలల క్రితం కూరగాయల ధరలు కొద్దిగా అందుబాటులో ఉన్నా ఇప్పుడు ఆకాశాన్నంటుతున్నాయి.

పేద కుటుంబాలకు మూడు పూటల కూరగాయల భోజనం తాహతుకు మించిన భారంగా మారుతోంది.

ధరలు బాగా పెరిగాయి..నెల కిందట, ప్రస్తుతం ధరలకు ఎంతో తేడా ఉంది. ఏది కొనాలన్నా రూ. 50పైనే ఉంది. ఇలాగైతే సామాన్యులు బతకడం కష్టమే. కూరగాయల ధరలను నియంత్రించాల్సిన అవస రముంది. కొందరు మధ్య వర్తులు అకారణంగా ధరలు పెంచుతున్నారు. గతంలో కిలోకు వెచ్చించిన ధరతో ఇప్పుడు కనీసం పావు కిలో రావడం లేదు.

ఏం కొనేటట్టు లేదు..

కూరగాయల ధరలు బాగా పెరిగాయి. రూ. 40 ఉన్న బెండకాయ, బీరకాయ ఇప్పుడు రూ. 80 చెపుతున్నారు. మధ్యతరగతి కుటుంబాల వారికి చాలా కష్టం. అరకిలో పావుకిలోతో సరిపెట్టుకుంటున్నాం. కూరగాయల ధరలు అందరికీ అందుబాటులో ఉండాలి. ధరలు పెరగడంతో సామన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రణిత రాణి, గృహిణి, పాడేరు

గిరిజన సమస్యలపై

20న రౌండ్ టేబుల్ సమావేశం

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పలు డిమాండ్ల సాధనకై ఈ నెల 20న నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సురేంద్ర పిలుపునిచ్చారు. పాడేరు గిరిజన సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ, జీవో 3ను పునరుద్ధరణ చేసి నూరు శాతం రిజర్వేషన్లు అమలుకు చట్టం చేయాలన్నారు. జిఓ 3పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యు పిటిషన్ దాఖలు చేయాలన్నారు. గిరిజన సంఘం దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్ లో ఉండగా రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతం లో మైదానం ప్రాంతం నుండి ఉపాధ్యాయుల్ని బదిలీ చేసి గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన షెడ్యూల్ ఏరియాలో ప్రత్యేక హక్కులను కాలరాస్తోందన్నారు.ప్రభుత్వం జోక్యం చేసుకుని షెడ్యూల్ ఏరియాలో జీఓ 3 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మన్నపడల్, జిల్లా కోశాధికారి కె.నర్సయ్య, జిల్లా నాయకులు ఎంఎం శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేంద్ర

అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు

-జిల్లాలో ఉచితంగా 3లక్షల నమోదు లక్ష్యం
-గుర్తింపు పొందితే బహు ప్రయోజనాలు...
-ప్రజాశక్తితో కార్మిక శాఖ అల్లూరి జిల్లా ఇన్చార్జి అధికారి టి.సుజాత

ప్రజాశక్తి-పాడేరు: అసంఘటిత రంగాలలోని కార్మికుల గుర్తింపునకు ఈ-శ్రమ్ పోర్టల్ లో ఉచితంగా నమోదు చేసి సామాజిక భద్రత, వివిధ సంక్షేమ పథకాలను కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా ఈ నమోదు ప్రక్రియ చేపట్టినట్లు కార్మిక శాఖ జిల్లా ఇన్చార్జి అధికారి టి సుజాత వెల్లడించారు. జిల్లాలో మూడు లక్షల మంది అసంఘటిత కార్మికుల గుర్తింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. జిల్లాలోని అసంఘటిత రంగాలలో పనిచేసే కార్మికుల గుర్తింపు ద్వారా వారికి కలిగే ప్రయోజనాలు తదితర వాటిపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆమె మాటల్లోనే.....

పథకంలో చేరడానికి అర్హులు ఎవరు?

అసంఘటిత రంగ కార్మికులుగా గుర్తింపు పొందడానికి ముఖ్యంగా 16 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్కులు ఉండాలి. ఆదాయపు పన్ను చెల్లించని వారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు పొందలేని కార్మికులు నెలకు 14 వేల లోపు జీతం తీసుకుంటున్న వారు అర్హులు. అసంఘటితరంగ కేటగిరి లలో తప్పనిసరిగా పనిచేస్తూ ఉన్న కార్మికులు మాత్రమే అర్హులవుతారు.

కార్మికులుగా ఎవరెవరిని గుర్తిస్తున్నారు?

వ్యవసాయ, అనుబంధ ఉపాధి రంగాలలో పని చేసేవారు, చిన్న సన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, నర్సరీలు ఉద్యానవనాలలో పని చేసేవారు ఉమ్మడి వ్యవసాయదారులు, భవన నిర్మాణ కార్మికులు(తాపీ, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్, ఎలక్ట్రీషియన్స్, ఇటుక సున్నం బట్టీలు, ఇతర వాటిల్లో పనిచేసే కార్మికులు) టైలరింగ్, అపేరల్ రంగాలలో పనిచేసే వారు. ఆటోమొబైల్ రంగంలో డ్రైవర్లుగా హెల్పర్లుగా పని చేసేవారు. చేతివృత్తులలో పని చేసేవారు. చిరు వ్యాపారులు, సేవా రంగాల్లో పనిచేసే కొరియర్ బాయ్స్, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడీలు, విద్యా వాలంటీర్లు, హమాలీలు, వీధి వ్యాపారులు, తదితరులు అసంఘటిత రంగ కార్మికులు గా గుర్తింపు పొందవచ్చు.

నమోదుకు అవసరమైన పత్రాలు

ముఖ్యంగా ఈ కేవైసీ కలిగిన ఆధార్, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్ నెంబర్ ఉండాలి. ప్రతి అసంఘటిత కార్మికుడు స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకొని గుర్తింపు పొందవచ్చు. ఆధార్ నెంబర్ ఎంటర్ చేయగానే మొబైల్ ఫోన్‌కు ఓటిపి వస్తుంది. ఈ సదుపాయం లేని వారు బయోమెట్రిక్ ఫింగర్ ప్రింట్ లేదా ఐరిష్ ద్వారా వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతా ఉండాలి.

ఎక్కడ నమోదు చేసుకోవాలి

కార్మికులు తమ సమీప ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా నమోదు చేసుకోవచ్చు. తమ కార్యాలయంలో సంప్రదిస్తే నమోదు చేస్తాం. జిల్లాలో ఇప్పటివరకు 28 వేల అసంఘటిత రంగ కార్మికుల నమోదు ప్రక్రియ నిర్వహించాం. నమోదు చేసుకున్న అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డు, యూనిక్ నెంబర్ జారీ అవుతుంది.

ప్రయోజనాలు ఏమిటి?

గుర్తింపు పొందిన ప్రతి ఆ సంఘటిత కార్మికుడికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు సంక్షేమ పథకాలు వర్తింపబడతాయి. ఒక సంవత్సరం పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 2లక్షల ప్రమాద/ మరణ/ అంగవైకల్యం పై ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తాం. వలస కూలీలను గుర్తించి వారికి అవసరమైన ఉపాధి పనులు కల్పిస్తాం. ప్రభుత్వం వారికి సంక్షేమ పథకాలను చేపడుతుంది.

బాల కార్మికుల గుర్తింపు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన మాసోత్సవాల భాగంగా జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ ద్వారా పాడేరు, పెదబయలు మండల కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించి వివిధ వ్యాపార సంస్థల్లో పని చేస్తున్న 14 ఏళ్లలోపు బాలలను గుర్తించి వారికి విముక్తి కల్పించాం. ఈ నెలాఖరు వరకు నిర్వహించే మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో వ్యాపార సంస్థలు బేకరీలు, హోటల్లు, షాపులు, ఇటుక బట్టీలు, తదితర వాటిల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట: ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, అభిమానులు పని చేయాలని టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్నుదొర పిలుపునిచ్చారు. తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు మద్దతుగా ఈనెల 20న మంగళవారం యండపల్లి వలస రైల్వే స్టేషన్ నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు యువగళం సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తున్నమన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో దొన్నుదొర మాట్లాడుతూ, నవరత్నాల పేరుతో అభివృద్ధి కుంటుపడే విధంగా పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతీ యువకులకు ప్రతి ఏటా ఉద్యోగాలు ఇస్తామంటూ బూటకపు మాటలు చెప్పి గాలిలో వదిలేసారని ఆయన విమర్శించారు. గతంలో యువతీ యువకులకు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ భృతి ఇవ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దొన్నుదొర

పోలవరం నిర్వాసితుల బాధలు, వరద బాధితుల కష్టాలు

కళ్లకు కట్టినట్లు ప్రదర్శనలివ్వండి

కళాకారుల శిక్షణ శిబిరంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

కళాకారుల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు, నిర్వాసితులు

ప్రజాశక్తి ఎటపాక

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల బాధలు, వరద బాధితుల కష్టాలను రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలిసేలా కళ్ళకు కట్టినట్టు కళా ప్రదర్శనలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కళాకారులకు పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితులు, వరద బాధితుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20 నుంచి సిపిఎం చేపడుతున్న పోరుకేక మహాపాదయాత్ర సందర్భంగా మండలంలోని ఎర్రగట్టు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా నాట్యమండలి కళారూపాల శిక్షణా శిబిరం 2వ రోజు ఆదివారం కూడా కొనసాగింది. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు ఆధ్వర్యాన మూడు రోజులపాటు శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. పాటలు, నృత్యాలు, డప్పులు వాయిద్యంపై శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని ఆదివారం మంతెన సీతారాం సందర్శించి, కళాకారులకు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులు, వరద బాధితుల ఇబ్బందులపై చైతన్యం చేయడానికి ఈ సాంస్కృతిక కళారూపాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జూన్ 20 నుండి జులై 4 వరకు 15 రోజులపాటు 400 కిలోమీటర్లు మేరకు జరిగే ఈ పాదయాత్రలో 12 సెంటర్లలో ఈ కళారూపాల ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర ప్రారంభ సభ ఎటపాక మండలం నెల్లిపాకలో జరుగుతుందన్నారు. ఇందులో అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజు కృష్ణన్ ప్రధాన వ్యక్తగా ప్రసంగిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ, ప్రజా సంఘాల నాయకులు సోంది రామారావు, జయమ్మ, జి హరనాథ్, పర్శిక ధర్మ రాజు, సత్తిబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

కూనవరం : మండలంలోని కూటూరు గ్రామంలో జరిగిన సమావేశంలో మహా పాదయాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య మాట్లాడుతూ ఏటా వచ్చే వరదలతో ఇబ్బంది పడుతున్న పోలవరం ముంపు నిర్వసితులకు న్యాయం జరిగేలా సీపీఎం పోరాడుతుందని తెలిపారు. ఈ పాదయాత్ర 15రోజులు 400 కిలోమీటర్లు సాగుతుందన్నారు. ఈ పాదయాత్రలో ప్రతి నిర్వాసితుడూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముంపు బాధితుల బాధలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా చేసి ఈ ప్రభుత్వాలు మొద్దు నిద్ర వీడేలా చేయాలని లక్ష్యంతో ఈ పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు కుంజా రాధ, గ్రామస్తులు పాల్గొన్నారు.

2022 వరదలను ప్రామాణికంగా తీసుకోవాలి

చింతూరు : 2022 వరదలను ప్రామాణికంగా తీసుకొని గ్రామాలన్నింటిని సర్వే చేయడానికి నోటిఫికేషన్ ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల పోరు కేక మహా పాదయాత్ర సందర్భంగా ఆదివారం చింతూరు సిపిఎం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాడార్ సర్వే పూర్తిగా తప్పుల తడకగా ఉందని, చింతూరులో మార్కండేయులుపేట అనే గ్రామం లేకపోవడంతో దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అందువల్ల 2022 వరదలకు ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించేందుకు సర్వే కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని, లేకుంటే ప్రభుత్వం చేసే కుట్రలను పాదయాత్ర సందర్భంగా ఎండగడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, కుంజా సీతారామయ్య, ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్, సీసం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

పోలవరం నిర్వాసితుల మహాపాదయాత్రను జయప్రదం చేయండి

సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి అప్పల నర్స

ప్రజాశక్తి-పాడేరు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యపై ఈనెల 20 నుంచి జూలై 4 వరకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాపాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర పోస్టర్లను ఆదివారం పాడేరులో ఆవిష్కరించారు. అనంతరం పాడేరు సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పి.అప్పలనర్స మాట్లాడుతూ, ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక గ్రామం నుండి పాదయాత్ర మొదలవుతుందని తెలిపారు. వందలాది మందితో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు విలీన మండలాలను కలుపుతూ జరిగే ఈ యాత్ర ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుకునూరు మండలాల్లో ప్రవేశించి జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, జంగారెడ్డి గూడెం మండలాల మీదుగా ఏలూరు, హనుమాన్ జంక్షన్, గన్నవరంల మీదుగా విజయవాడ వరకు కొనసాగుతుందని తెలిపారు. విజయవాడలో జూలై 4న మహాధర్నాతో ముగుస్తుందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపించ లేదన్నారు. నిర్వాసితుల సమస్యలు దయనీయంగాను ఉన్నాయన్నారు. గత సంవత్సరం వచ్చిన వరదలలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు మండలాలు, ఏలూరు జిల్లాలోని రెండు మండలాలు వంద రోజులపాటు వరదలో మునిగి ఉన్నాయని తెలిపారు. వేలాది కుటుంబాలు నిరాశ్రయులై నానా అగచాట్లు పడ్డా ప్రభుత్వం సహాయక చర్యలు చేయలేదని విమర్శించారు. ఈ సంవత్సరం జూన్, జూల్కె, ఆగస్టు నెలల్లో వరద వచ్చే ప్రమాదం ఉందని, ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 చట్టం సమగ్రంగా అమలు చేసి పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బిసిహెచ్.పడాల్, పాడేరు మండలం కార్యదర్శి ఎల్.సుందర్‌రావు, ఎ.దార కొండ, ఎంపీటీసీ ఏ.బుజ్జిబాబు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స, పడాల్, బుజ్జిబాబు, సుందరరావు

ఆధార్, సదరం లేక సంక్షేమ పథకాలకు నోచని వికలాంగుడు

- ధీనస్థితిలో భిక్షాటన చేస్తున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి -సీలేరు

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శివ. తూర్పుగోదావరి జిల్లా తుని గొల్ల అప్పారావు సెంటర్లో శివ తల్లిదండ్రులు నివాసముంటున్నారు. లారీ ప్రమాదంలో రెండు కాళ్లు పోగట్టుకున్న శివకు ఆధార్ కార్డుగాని, సదరం సర్టిఫికెట్‌గాని లేవు. దీంతో ఆయనకు వికలాంగ పింఛనుతో సహా ప్రభుత్వ సంక్షమ పథకాలేవీ అందడం లేదు. శివను ఆయన చిన్నాన్న కుమారుడు జి.ఏసు వీపుపై ఎక్కించుకొని తిప్పుతుంటే భిక్షాటన చేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం సీలేరు వారపు సంతలో పొట్ట కూటి కోసం భిక్షాటన చేస్తున్న శివను ప్రజాశక్తి పలకరించింది. ఆయన ధీనస్థితిపై ఆరా తీసింది. తను ఎలా అవిటవాడినయ్యాడో, తన కుటుంబ పరిస్థితి ఏమిటో తెలియజేశాడు. ఆ వివరాలు శివ మాటల్లోనే.... తల్లిదండ్రులకు శివ ఒక్కడే కుమారుడు. శివ లారీ క్లీనర్‌గా పనిచేయగా, తల్లిదండ్రులు కూలి పని చేసుకుంటూ కుటుంబ జీవనం సాగించేవారు. 13 ఏళ్ల క్రితం విధి వక్రీకరించి లారీ ప్రమాదంలో శివకు రెండు కాళ్లు పోయాయి. దీంతో శివ ఏ పనీ చేయలేని పరిస్థితి. తల్లిదండ్రుల పోషణ భారం కూడా శివపై పడింది. మరొకరు తోడుంటే తప్ప బతకడం కష్టంగా మారిన శివకు ఆయన చిన్నాన్న కుమారుడు జి.ఏసు తోడై భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శివకు ఆధార్ కార్డు లేదు. సదరం సర్టిఫికెట్ లేదు. దీంతో వికలాంగ పింఛన్ మంజూరు కాలేదు. తమ గ్రామంలో తమకు ఎవరు పట్టించుకునే నాధుడే లేరని శివ వాపోయాడు. పత్రిక ద్వారా తన బాధను తెలియజేస్తే పింఛన్ అయినా మంజూరు చేస్తారని ఆశతో ఎదురుచూస్తున్నానని శివ తెలిపాడు. తాను ప్రమాదంలో రెండు కాళ్ల పోగొట్టుకొని అవికివాడిని కావడంతో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నానని చెప్పాడు. తమ పట్ల ఉదార స్వభావంతో ప్రజలు వ్యవహరిస్తూ ఎవరికి తోచిన విధంగా వారు సహాయం చేయడం వలన ఆ డబ్బులతో తన జీవనం సాగిస్తున్నారని వెల్లడించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా అధికారులు స్పందించి తనకు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ మంజూరు చేసి వికలాంగు పెన్షన్ ఇప్పించాలని శివ మొర పెట్టుకున్నాడు.

రెండు కాళ్లు పోగట్టుకున్న శివ

గల్లంతైన బాలుడి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- చింతూరు

మండలంలో శబిరి నదిలో శనివారం గల్లంతైన బాలుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. మండలంలోని చిడుమూరు గ్రామానికి చెందిన కట్టం విష్ణు(15) అనే బాలుడు శనివారం సాయంత్రం స్నానానికి శబరి నదికి దిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం సాయంత్రం కుయిగూరు వద్ద బాలుడి మృతదేహం లభ్యమైంది. చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నది ఒడ్డున కట్టం విష్ణు మృతదేహం

పరిశీలిస్తున్న జెడ్పిటిసి సభ్యులు మత్స్యలింగం

నిర్మాణ పనుల్లో నాణ్యతను పాటించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:అంగన్వాడి భవనం నిర్మాణానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలని జెడ్పిటిసి రేగం మత్స్యలిగం సూచించారు. మండలంలోని దుర్గం పంచాయతీ సరసపాడు గ్రామంలో ఆదివారం జడ్పిటిసి పర్యటించారు. ఇటీవల జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో మంజూరు చేసిన అంగన్వాడీ భవనాన్ని జడ్పిటిసి రేగం మత్స్యలిగం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పిసిటిసి మాట్లాడుతూ, గతంలో అంగన్వాడి భవనాలు లేక ఆరుబయట పాఠాలు చెప్పేవారని ఆయన అన్నారు. అంగన్వాడి భవనాన్ని పటిష్టంగా, నాణ్యతగా నిర్మించాలని ఆయన సూచించారు. నాశిరకంగా నిర్మాణం చేపడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొత్త బల్లుగుడ ఎంపీటీసీ స్వాభి రామమూర్తి, దుర్గం మాజీ ఎంపీటీసీ వారబోయిని బాలన్న, మజ్జి కొండ బాబు, దేముడు పాల్గొన్నారు.


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- పెదబయలు: గోమంగి పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని అరకు శాసనసభ్యులు పాల్గుణకు ఉపసర్పంచ్ కొండబాబు కోరారు. ఈ మేరకు పాల్గుణకు వినతి పత్రం అందించారు. గోమంగి పంచాయతీ గ్రామాల్లో మంచినీటి సమస్య త్రీవంగా ఉందన్నారు. వర్షాకాలంలో కలుషితమైన నీటిని తాగి అనేక రోగాల బారిన పడుతున్నామని, డ్రైనేజ్, సీసీ రోడ్డు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులతో ఫోనులో మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదబయలు జడ్పిటిసి సభ్యుడు బొంజుబాబు, అల్లూరి జిల్లా యువజన విభాగం జిల్లా కార్యదర్శి బోండా విజయ్ కుమార్, వైసిపి నాయకులు కుర్ర లక్ష్మణ్‌రావు, సీసాల కళ్యాణం పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: గొలుగొండ మండలంలో ఆర్లీ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆర్లీ అటవీ ప్రాంతంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా రోడ్డు విస్తరణ చేపట్టేందుకు 2020లో చర్యలు చేపట్టామన్నారు. అటవీ శాఖ, ఆర్అండ్‌బి అధికారులకు ఈ నివేదికలు పంపామన్నారు. 2021 లో రాష్ట్ర ఫారెస్ట్ అధికారులకు వినతి పత్రాన్ని అందించామని తెలిపారు. రోడ్డు విస్తరణలో బాధితులకు పాకలపాడు 203 సర్వే నవంబరులో 5.25 సెంట్లు భూమిని గుర్తించడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణపై ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈనెల 22 నుండి విస్తరణ పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన అన్నారు.

సన్ డే

భరించలేనంతగా ఎండల తీవ్రత

నిర్మానుష్యంగా పాడేరు నుంచి చోడవరం వెళ్లే ప్రధాన రహదారి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లాలో ఆదివారం కూడా సూర్యుడు ప్రతాపం చూపించాడు. గత కొన్ని రోజులుగా ఎండల తీవ్రత తగ్గడం లేదు. జిల్లాలోని ఆయా మండలాల్లోనూ ఎండలు దంచి కొడుతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ తీవ్రతకు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తలపోటు, నీరసం, విరోచనాలు వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జోరుగా వర్షాలు కురవాల్సిన జూన్ మూడో వారంలో కూడా ఈ స్థాయి ఎండల తీవ్రత ఎన్నడూ చూడలేదని ప్రజలు వాపోతున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా ఉష్ణం పుట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో 36 నుంచి 44 డిగ్రీల పైనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం భయాందోళన కలిగిస్తుంది. ఆదివారం గంగవరంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని ఆయాచోట్ల పరిశీలిస్తే కూనవరంలో 42.2, కొయ్యురులో 41.5, మారేడుమిల్లిలో 40.0, అడ్డతీగలలో 41.9, వై.రామవరంలో 41.0, రంపచోడవరంలో 40.3, రాజవొమ్మంగిలో 33.6, అనంతగిరిలో 35.2, అరకులోయలో 35.2 చింతపల్లిలో 36.1, డుంబ్రిగుడలో 34.9, జికెవీధిలో 36.9, జి.మాడుగులలో 32.8, హుకుంపేటలో 36.3, ముంచంగిపుట్టులో 34.9, పాడేరులో 34.7, పెదబయలులో 38.9, దేవీపట్నంలో 42.9, వరరామచంద్రపురంలో 41.8, నెల్లిపాకలో 41.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

పాడేరులో ఎండకు తాళలేక గొడుగులు వేసుకున్న చిరు వ్యాపారులు

100 అడుగుల రోడ్ల విస్తరణతో నష్టం

రోడ్డు విస్తరణ బాధితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం అభివృద్ధి జరగడం తమకు ఆనందదాయకమని, కానీ 100అడుగుల రోడ్డు విస్తరణతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడతాయని బాధితుల సంక్షేమ సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు ఆదివారం స్థానిక రామచంద్ర ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్డు విస్తరణ బాధితుల సంక్షేమ సంఘం భవన యజమానులు మాట్లాడుతూ, రోడ్డు విస్తరణకు తాము వ్యతిరేకం కాదని, 80 అడుగులు రోడ్డు విస్తరణ చేస్తే తమకు అభ్యంతరం లేదన్నారు. పట్టణం అబివృద్ధి చెందడం తమకు ఎంతో ఆనందదాయకమని రోడ్డు విస్తరణ లో నష్టపోయిన వారికి టిడిఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం చెల్లించడం మంచిదని పేర్కొన్నారు. 100 అడుగుల విస్తరణ చేపట్టినప్పుడు సుమారు 250 కుటుంబాలు నష్టపోతారని, భవిష్యత్తులో తుని రోడ్డు, చింతపల్లి రోడ్డు వంద అడుగుల విస్తరణ చేస్తే అనేకమంది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఇప్పుడు 100 అడుగులు విస్తరణ చేసినప్పుడు భవిష్యత్తులో తుని, చింతపల్లి రోడ్డు చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని రోడ్లు 100 అడుగులు విస్తరణ చేస్తే ఎంతమంది నష్టపోతారని, ఈ విషయమై ఒక్కసారి ఆలోచించాలన్నారు. ప్రస్తుతం నష్టపోతున్న వారందరికీ టి.డి.ఆర్ బాండ్లు కాకుండా నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అంటే తమకు అపారమైన గౌరవమని తెలిపారు. అతిపెద్దవైన అనకాపల్లి, తుని వంటి పట్టణాల్లోనే ఈ రకమైన విస్తరణ లేదని, నర్సీపట్నంలోనే వంద అడుగుల విస్తరణ చేయడానికి ఎందుకు పూనుకుంటున్నారో అర్థం కాలేదని పేర్కొన్నారు.ఎమ్మెల్యే, అధికారులు చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

మున్సిపల్ నూతన పాలకవర్గానికి సమస్యల స్వాగతం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలో నూతన పాలకవర్గానికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నర్సీపట్నంలో డ్రైనేజీ, అపారిశు ద్యం, పందుల బెడద, కుక్కలతో ఇబ్బందులు, వెలగని వీధి దీపాలు వంటి అనేక సమస్యలు సవాల్‌గానే మారనున్నాయి. ఇప్పటివరకు మునిసిపల్ ఎన్నికల తర్వాత ఏర్పడిన పాలక వర్గానికి ఎన్నిసార్లు సమస్యలు విన్నవించుకు న్నప్పటికీ పరిష్కారం మార్గం సుగమం కాలేదు. మున్సిపల్ కమిషనర్ కనకారావు, మాజీ చైర్పర్సన్ ఆదిలక్ష్మికి మధ్య సరైన సఖ్యత లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేశాయి. వైసిపి నాయకుల నిర్ణయం మేరకు నూతన పాలకవర్గం ఏర్పడి బోడపాటి సుబ్బలక్ష్మి చైర్పర్సన్ గానూ, కోనేటి రామకృష్ణ వైస్ చైర్మన్ గాను ఎన్నుకోవడం జరిగింది. మున్సిపల్ వార్డు సమస్యలను సవాల్‌గా తీసుకుని నూతనంగా ఏర్పడిన పాలకవర్గం పరిష్కరిస్తుందని మున్సిపాలిటీ ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ అనేక సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలుస్తోంది. వేసవి కాలంలో ప్రజలు అధికంగా వేడికి అల్లాడుతున్న సమయంలో ఏదోక వార్డులో విద్యుత్ సమస్య ఎదురవుతూనే ఉంది. 22వ వార్డు వెంకునాయుడుపేటలో వార్డు కౌన్సిలర్ భర్త వీధిలైట్లు ఆర్పడం వెలిగించడం తన పనిగా మారిం దని అధికారులకు విషయాన్ని తెలియజేసినప్పటికీ కనీసం స్పందించలేదన్నారు.

'వైసిపి నాయకుల గుండెల్లో గుబులు'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : వారాహి యాత్ర విజయవంతం కావడంతో వైసిపి నాయకుల గుండెల్లో గుబులు పుట్టుకుందని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు అన్నారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయి, ఇసుక, మద్యం మాఫియా పెరిగిపోయాయని, విశాఖ ఏజెన్సీ నుంచే గంజాయి దేశ వ్యాప్తంగా సరఫరా అవుతుందని చెప్పారు. ఇద్దరు వైసిపి ఎంపీల భూ దందాల వర్గాల మధ్య వచ్చిన సెటిల్‌మెంట్‌లో భాగమే నగరంలో ఎంపీ కుటుంబీకుల కిడ్నాప్ వ్యవహారం అని ఆరోపించారు. విశాఖ అరాచకాలకు అడ్డాగా మారిందని, ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్ గా కాకుండా నేర విశాఖగా తయారు చేస్తున్నారని విమర్శించారు. విశాఖలో రౌడీ షీటర్లు విచ్చలవిడిగా చెలరేగుతున్నారని, వైసిపి నాలుగేళ్ల పాలనలో విశాఖలో రూ.44 వేల కోట్లు భూదందాలు జరిగాయని ఆరోపించారు. జనసేన ఉత్తర ఇంచార్జ్ పసుపులేటి ఉషా కిరణ్, దక్షిణ నియోజకవర్గ నాయకుడు పి.శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

'దేశంలో మత విద్వేష రాజకీయాలు'

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని పక్కనపెట్టి, దేశంలో మతవిద్వేష రాజకీయాలను మోడీ ప్రభుత్వం నడుపుతోందని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు ఆరోపించారు. ఆదివారం నీలం రాజశేఖర్ రెడ్డి భవనంలో ఎఐవైఎఫ్ జిల్లా మహాసభ నిర్వహించారు. మాజీ యువజన నాయకులు పి.చంద్రశేఖర్ సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభలో లెనిన్‌బాబు మాట్లాడుతూ, దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టడంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ ఎజెండాగా ఉందన్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళీ సుబ్బారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జాబ్ క్యాలెండర్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నిలువుగా ముంచారని విమర్శించారు. ఎస్‌వి.యూనివర్సిటీ మాజీ అధ్యాపకుడు కె. క్షేత్రపాల్ మాట్లాడుతూ, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి వారి స్పూర్తితో దేశంలో యువత భవిష్యత్తు కోసం, చుట్టూ జరిగే అన్యాయాలపై పోరాటాలకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు, యువకులు పాల్గొన్నారు.

20న జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నంలోని ఉత్కల్ సాంస్కృతిక సమాజ్ ఆధ్వర్యాన జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహిస్తున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు జెకె నాయక్ తెలిపారు. ఆదివారం ఉదయం సిరిపురంలోని జగన్నాథ స్వామి ఆలయం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 20న దసపల్లా హిల్స్ వద్ద ఉన్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయం నుంచి భక్తులు సంకీర్తనలతో రథయాత్ర ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో బిమల్ కుమార్ మహంత తెలిపారు.

ప్రపంచ తెలుగు ఐటి సమ్మిట్‌కు పల్సస్ గ్రూప్ సిద్ధం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ప్రపంచవ్యాప్తంగా తెలుగు ఐటి ప్రొఫెషనల్స్‌ను కనెక్ట్ చేయడానికి పల్సస్ ప్రణాళిక సిద్ధం చేస్తుందని పల్సస్ గ్రూప్ సిఇఒ డాక్టర్ గేదెల శ్రీను తెలిపారు. ఆదివారం అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యాన సిరిపురంలోని వాల్తేర్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది తెలుగు ఐటి నిపుణులు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా ఉత్తర అమెరికాలో, పల్సస్ గ్రూప్ మద్దతుతో వరల్డ్ తెలుగు ఐటి కాన్ఫరెన్స్ నిర్వహణకు ప్రపంచ తెలుగు ఐటి సదస్సులు నిర్వహణ సభ్యులకు విలువైన వేదికగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

జీడి మామిడి రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో ఎన్.నర్సాపురం గ్రామంలో జీడి మామిడి తోటల్లో మంటలు చెలరేగి జీడి మామిడి చెట్లు దగ్ధమయ్యాయని బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు కోరారు. ఆదివారం కాలిపోయిన జీడి మామిడి చెట్లను పరిశీలించారు. బాధిత రైతులు అప్పలరాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 9 మంది జీడి మామిడి రైతులకు చెందిన 4-50 ఎకరాల భూములో జీడి మామిడి తోటల్లో మంటలు చెలరేగి కాలి పోయాయన్నారు. పంట ఫలసాయం చేతికి అందివచ్చే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో పేద రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏజెన్సీకి మైదాన ప్రాంత ఉపాధ్యాయుల బదిలీ సరికాదు : ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-ఉక్కునగరం : సుప్రీం కోర్టులో జిఒ3పై రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, విద్యాశాఖ అధికారులు మైదాన ప్రాంత ఉపాధ్యాయలను ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆదివాసీ గిరిజన సంఘం ఒక ప్రకటనలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. ఏజెన్సీలోని నూరు శాతం పోస్టులు గిరిజనులకే రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు.
టిఎసిలో నూరు శాతం రిజర్వేషన్లపై తీర్మానం చేసిన గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీకి మైదానప్రాంతం నుంచి 400 మంది రెగ్యులర్ టీచర్స్‌ను బదిలీ చేశారన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం దాఖలు చేసిన పిటిషన్ కోర్టులో పెండింగ్‌లో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీకి మైదానం ప్రాంతం నుండి ఉపాధ్యాయులను బదిలీ చేయడం ఆదివాసీ గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేసినట్టేటని ప్రకటనలో పేర్కొన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన షెడ్యూల్ ఏరియా ప్రత్యేక హక్కులను ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు .ప్రభుత్వం జోక్యం చేసుకుని షెడ్యూల్ ఏరియాలో జిఒ 3 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ కొనసాగించాలని కోరారు. జిఒ3 రద్దుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఏజెన్సీలోని పోస్టులను షెడ్యూల్డ్ నిబంధనలకు వ్యతిరేకంగా, జిఒ 3కు భిన్నంగా గిరిజనేతర ఉపాధ్యాయులతో భర్తీ చెయ్యడాన్ని ఖండిస్తున్నామని 'ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ పట్నం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిముడు చిన్నంనాయుడు, జి.వి .రమణ మూర్తి పేర్కొన్నారు.

సృష్టి వరల్డ్ స్కూల్‌లో యోగా డే

ప్రజాశక్తి-ఉక్కునగరం : ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉక్కనగరం సెక్టర్ 11లోని సృష్టి వరల్డ్ స్కూల్‌లో ఆదివారం ముందస్తుగా యోగాడేను నిర్వహించారు. 'వసుదైక కుటుంబం కోసం యోగా' థీమ్‌తో పాఠశాల ఆవరణంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా యోగాలో పాల్గొన్నారు. తల్లిదండ్రుల కోసం ప్రత్యేక సెషన్ నిర్వహించారు.
ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఇ.చంద్రిక మాట్లాడుతూ, ప్రతిఒక్కరి దినచర్యలో యోగాను భాగం చేయాలనే లక్ష్యంతో దీనిపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వందమందికి పైగా పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులకు అనుభవజ్ఞులైన అభ్యాసకులు యోగాసనాల టెక్నిక్స్‌లో శిక్షణనిచ్చారు. ఒత్తిడినుంచి ఉపశమనానికి, మంచి ఆరోగ్యానికి యోగ అవసరాన్ని వివరించి, వయస్సులతో తేడా లేకుండా ప్రతిఒక్కరూ యోగాభ్యసనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ ప్రిన్సిపల్ శ్రీధర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ సునయన, పాఠశాల డైరెక్టర్ పి.సుశీలారాణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘనా కంభం, కోఆర్డినేటర్లు ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

జి.సంతోష్

కె.సందీప్

పి.మోహన్

ప్రజాశక్తి- మధురవాడ : జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గిరిజన విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివ ప్రసాద్ తెలిపారు. అల్లూరి జిల్లా కలెక్టర్, పాడేరు ఐటిడిఎ పిఒ ఆధ్వర్యంలో మారికవలస గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణా సంస్థలో శిక్షణ పొందుతున్న 18 మంది విద్యార్థులు ఈ ఏడాది జెఇఇ అడ్వాన్స్‌డు ప్రవేశపరీక్షకు హాజరుకాగా, వారిలో డుంబ్రిగుడ మండలం పింపలగూడ గ్రామానికి చెందిన సాదారణ వ్యవసాయ కూలీ జి.అర్జున్ కుమారుడైన జి.సంతోష్ ఎస్‌టి కేటగిరీలో 483వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. హుకుంపేట మండలం ముళ్ళమెట్ట గ్రామానికి చెందిన కె.సన్యాసిరావు అనే రైతు కొడుకు కె.సందీప్ ఎస్‌టి కేటగిరీలో 583వ ర్యాంకును, గూడెం కొత్తవీధి మండలంలోని సిహెచ్ గంగవరం గ్రామానికి చెందిన పి.సోమరా అనే కూలీ కుమారుడైన పి.మోహన్ ఎస్.టి కేటగిరీలో 1625 వ ర్యాంకును సొంతం చేసుకున్నారని తెలిపారు. వీరికి దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఐఐటిలో సీట్లు పొందేలా ర్యాంకులు సాధించడంపై ప్రిన్సిపల్ శివప్రసాద్ హర్షం వ్యక్తం చేసి, అభినందించారు. వీరికి అల్లూరి కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటిడిఎ పిఒ అభిషేక్ అభినందనలు తెలిపారు.

ఆదివాసీల సమస్యలు పట్టని ప్రభుత్వాలు

మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి: పోలవరం నిర్వాసితుల, ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టడం లేదని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు అన్నారు. శనివారం మండలంలోని దుర్గానగరం గ్రామంలో కోండ్ల సూరిబాబు అధ్యక్షతన 'గిరిజన హక్కులు - చట్టాలు' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన బాబూరావు మాట్లాడుతూ పోలవరం ముంపులో 193 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకుని లక్ష మందికిపైగా గిరిజనులు నిరాశ్రయులయ్యారన్నారు. వారికి సరైన పునరావాసం లేకపోగా, ముంపుకు గురైన సమయంలో ప్రభుత్వాలు సరైన సహాయక చర్యలు కూడా చేపట్టలేదని అన్నారు. వరద నష్టపరిహారమూ అందించలేదన్నారు. రానున్న వర్షాకాలంలో మళ్లీ వరదలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏమాత్రమూ ప్రజలను రక్షించడానికి సిద్ధంగా లేదన్నారు. ఏజెన్సీలో గిరిజన హక్కులు, చట్టాలను ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయన్నారు, గిరిజనులను అడవి నుంచి గెంటేసే కుట్ర జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బోయ/వాల్మీకిలను, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఏజెన్సీలో కనీస మౌలిక వసతులు నేటికీ అందని ద్రాక్షగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రోజురోజుకూ కనుమరుగవుతున్నాయని వాపోయారు. ఉపాధి పనులు గణనీయంగా తగ్గిపోవడంతో గిరిజనుల ఆర్థిక స్థితిగతులు అంతంతమాత్రంగా తయారయ్యాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు గిరిజన ప్రాంత అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లిరెడ్డి, మండల అధ్యక్షులు కె.జగన్నాథం, ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న బాబూరావు

ఏజెన్సీలో పోలీసుల విస్తృత తనిఖీలు

రంపచోడవరం, సీలేరుల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు :జీకే వీధి మండలం సీలేరులో ఆదివారం వారపు సంతలో సిఆర్పిఎఫ్ పోలీసులు, సివిల్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రధాన కుడళ్ళు వద్ద పోలీసు బలగాలును మొహరించి వాహనాలను తనిఖీలు చేశారు. అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. కార్లు ఆటోలు తదితర వాహనాలను తనిఖీలు నిర్వహించారు. వ్యక్తుల వివరాలు సేకరించి అనంతరం విడిచిపెట్టారు. అదేవిధంగా గంజాయి స్మగ్లర్లు అక్రమ రవాణాపై పోలీసులు నిఘ పెట్టారు. ఏపీ జెన్కో చెక్‌పోస్టు, రామాలయం, ఐటిఐ జంక్షన్ వద్ద సివిల్ సిఆర్పి పోలీస్ బలగాలు మోహరించి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలను తనిఖీలు చేశారు.

రంపచోడవరం : రంపచోడవరం మండలం పందిరి మామిడి జంక్షన్ వద్ద ఆదివారం ఎస్‌పి ఆదేశాల మేరకు ఏఎస్పీ జగదీష్ అడహల్లి పర్యవేక్షణలో రంపచోడవరం ఎస్సై మోహన్ కుమార్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు అతిక్రమించిన, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారిని తనిఖీ చేసి వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

తనూషకు ఉత్తమ నటి అవార్డుపై హర్షం

ప్రజాశక్తి- సీతమ్మధార: వికెఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ మీడియా సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల వికెఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ షార్ట్ ఫిలిమ్స్ అవార్డులలో విశాఖకు చెందిన ఇమంది ఈశ్వరరావు హాస్య క్రియేషన్స్ బ్యానర్‌పై నటించి, దర్శకత్వం వహించిన ప్లాస్టిక్ ప్రేమ లఘు చిత్రంలో నటించిన తనూషకు ఉత్తమ నటి అవార్డుదక్కిందని దర్శకుడు ఈశ్వరరావు తెలిపారు. హైదరాబాదు ప్రసాద్ ల్యాబొరేటరీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అవార్డును అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ, ప్లాస్టిక్ ప్రేమ సినిమాలో నటించిన తనూషకు ఉత్తమ నటి అ్వార్డు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తనూషను అభినందించారు. కార్యక్రమంలో తోటి కళాకారులు, రచయిత, నిర్మాత, దర్శకులను అభినందించారు.

అప్రకటిత విద్యుత్ కోతలపై టిడిపి ఆందోళన

ప్రజాశక్తి -గాజువాక :అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని కోరుతూ, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పెదగంట్యాడ సబ్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పులి రమణారెడ్డి మాట్లాడుతూ నెల రోజులుగా వేళాపాళా లేని అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థాయి చాలకపోవడంతో లోవోల్టేజీ సమస్య ఉత్పన్నమై గృహోపకరణాలు పాడౌతున్నాయని ఆరోపించారు.దీనిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఏవేవో కుంటిసాకులు చెబుతూ విద్యుత్‌శాఖ అధికారులు తప్పించుకుపోతున్నారన్నారు. దీనిపై వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే, యువత, మహిళలు, వినియోగదారులతో పెద్దఎత్తున తరలివచ్చి విద్యుత్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. విద్యుత్ సమస్యలపై మొక్కుబడి చర్యలు మానేసి, శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, గోక్యాడ ముత్యాలు, మురళి, ఎల్లంకి రమణ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ రూటు పరిశీలన

ప్రజాశక్తి- సింహాచలం: వచ్చేనెల 2న ఆషాడ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రతి ఏటా ఆనవాయితీగా నిర్వహించే గిరిప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఆదివారం గిరి ప్రదక్షణ సాగే ప్రదేశాలను, అక్కడ ఉన్న పరిస్థితులను భక్తులు నడిచేందుకు ఏ విధంగా అనుకూలంగా ఉందనే విషయాలను అధికారులు, పోలీసులతోపాటు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పరిశీలించారు. నగర ట్రాఫిక్ డిసిపి, గోపాలపట్నం సిఐలు, ఎస్ఐ, దేవస్థానం ఇఇలు శ్రీనివాసరాజు, రాంబాబు, ట్రస్ట్ బోర్డు సభ్యులు రాజేశ్వరి, రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

నెహ్రూ పేరు మార్చడం చౌకబారు రాజకీయం

ప్రజాశక్తి- మాధవధార : నెహ్రూ మ్యూజియం అండ్ లైబ్రరీ సొసైటీని ప్రైమ్ మినిస్టర్ మ్యూజియంగా మార్చడం ద్వారా బిజెపి చౌకబారు రాజకీయం చేస్తోందని ఎపిసిసి, ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు మండిపడ్డారు. దేశ తొలిప్రధానిగా 17ఏళ్లపాటు ఆ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించిన జవహర్ లాల్ నెహ్రూ, భారత జాతీయోద్యమంలోనూ ఉన్నారన్నారు. మహాత్మాగాంధీతో ఉన్న సాన్నిహిత్యం ఉన్న నెహ్రూ, నవ భారత రూపశిల్పిగా ఎన్నో సేవలు అందించారన్నారు. 1964లో రోదసిలోకి తొలి రాకెట్ ప్రయోగం, 1969లో తొలి అణురియాక్టర్ ఏర్పాటు, నేటి ఐఐటి, ఎయిమ్స్, ఐఐఎంఎస్, నాగార్జునసాగర్ డ్యాం, బాక్రానంగల్ ప్రాజెక్టు వంటి పంచవర్ష ప్రణాళికా రూపశిల్పిగా నెహ్రూ హయంలో ఏర్పాటయ్యాయన్నారు. అంతటి మహానాయకుడి పేరును మార్పుచేసి, నెహ్రూ మ్యూజియంకు ప్రైమ్‌మినిస్టర్ మ్యూజియంగా పేరు మార్చడం ద్వారా భావితరానికి బిజెపి ఏం సందేశాన్ని ఇస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ మూలాలు లేకుండా చేయాలన్న బిజెపి కుట్రలు ఎన్నటికీ సాగవని వెంకటరావు హెచ్చరించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. తమతోపాటు చదువుకుని, కష్టాల్లో ఉన్న పూర్వ స్నేహితులకు ఇతోధిక సాయం అందించారు. 1992బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కొండపేటకు చెందిన తమ సహచరుడు వాద్ర రామలక్ష్మణ కుటుంబానికి ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. అలానే అనారోగ్యం బారిన పడిన కొత్తపేట^ చెందిన అల్లు గౌరికి రూ 5వేలు సాయం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బడిగింటి మహేష్, గాడి భాస్కర్, ఎస్ శ్రీనివాసవర్మ, హేమ, ఎం సుబ్బారావు, పిట్టా శ్రీను, కె శ్రీను, జి సురేష్ పాల్గొన్నారు

విఆర్ఎల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి -ఆనందపురం : విఆర్ఎల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడం తగదని విఆర్ఎల సంఘం భీమిలి జోన్ గౌరవాధ్యక్షులు రవ్వ నర్సింగరావు, పోలిపల్లి, అప్పలరాజు, ఎద్దు అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. విఆర్ఎలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, డిఎ బకాయి చెల్లింపు, విఆర్ఎలకు అర్హతలను బట్టి విఆర్ఒ, అటెండర్, డ్రైవర్, వాచ్‌మ్యాన్ ఇతర ఉద్యోగాలకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. మహిళా విఆర్ఒలకు ఆరు నెలల మెటర్నిటీ సెలవులు, చనిపోయిన విఆర్ఎ కుటుంబాలకు గ్రాట్యూటీ, పిఎఫ్ బకాయి చెల్లింపుతోపాటు నామినీలకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.